క్లుప్తంగా

నేడు దత్త జయంతి

కనిగిరి రూరల్: స్థానిక షిర్డీ సాయిబాబా దేవస్థానంలో ఈనెల 26న మంగళవారం దత్త జయంతి వేడుకలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు దేవకి సుబ్రహ్మణ్యం తెలిపారు. ఉదయం 9 గంటల నుంచే స్వామికి అభిషేకాలు, సామూహిక పూజలు జరుగుతాయన్నారు.

4న మండల సమావేశం

పామూరు: మండల సర్వసభ్య సమావేశం జనవరి 4న ఎంపీపీ గంగసాని లక్ష్మి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఊట్ల శ్రీనివాసులు తెలిపారు. సమావేశానికి జెడ్పీటీసీ, వైస్ ఎంపీపీలు, కోఆప్షన్ సభ్యుడు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు హాజరుకావాలన్నారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు పూర్తి సమాచారంతో సమావేశానికి హాజరు కావాలని కోరారు.

దుస్తులు, చీరలు పంపిణీ



దుస్తులు పంపిణీ చేస్తున్న ఎంపీటీసీ, రంగబాబు

కనిగిరి రూరల్: క్రిస్మస్ సందర్భంగా ఎడవల్లి ఎంపీటీసీ వట్టి వేళ్ల రంగమ్మ, వైఎస్సార్ సీపీ నాయకుడు వట్టి వేళ్ల రంగబాబు మండలంలోని యర్రోబనపల్లి, కమ్మవారిపల్లికి చెందిన పాస్టర్లకు దుస్తులు, 60 మంది వృద్ధులకు సోమవారం చీరలు పంపిణీ చేశారు. మాజీ ఎంపీటీసీ జీవరత్నం, దేవాంగ సంక్షేమ సంఘం నాయకులు, స్థానిక పార్టీ నాయకులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి



మృతి చెందిన గేదె

టంగుటూరు: విద్యుదాఘాతంతో గేదె మృతి చెందిన సంఘటన మండలంలోని కొణిజేడు గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. బాధితుడు ఈదా సుబ్బారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. తాను గేదెను మేపుతుండగా గ్రామంలోని కుమ్మరి గొంది వద్ద విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ తీగ తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. ఈ మేరకు బాధితుడు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

మనుస్మృతికి వ్యతిరేకంగా నిరసనలు

చీమకుర్తి: నిమ్నజాతులను అణగదొక్కడానికి కారణమైన మనుస్మృతిని అంబేడ్కర్ స్మృతివనం, కేఎన్‌పీఎస్ ఆధ్వర్యంలో ఆయా సంఘాల నాయకులు సోమవారం దహనం చేశారు. పేర్నమిట్టలోని అంబేడ్కర్ స్మృతివనం అధ్యక్షుడు, సభ్యుడు నూకతోటి రామారావు, నూకతోటి రవికుమార్ ఆధ్వర్యంలో మనుస్మృతి పేపర్లను అంబేడ్కర్ విగ్రహం వద్ద దహనం చేసి నిరసనలు తెలిపారు. చీమకుర్తిలోని పోలీస్‌స్టేషన్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద కేఎన్‌పీఎస్ నాయకులు ఆరెతోటి రాంబాబు, గంటెనపల్లి పోతురాజు, ఎంఆర్పీఎస్ నాయకుడు బక్కా రాజు ఆధ్వర్యంలో మనుస్మృతి పత్రాలను దహనం చేశారు. 1927 డిసెంబర్ 25న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మహద్ గ్రామంలోని చెరువు వద్ద నిమ్నజాతులను అవమానాలకు గురిచేస్తూ అణగదొక్కబడుతున్న మనుధర్మశాస్త్ర గ్రంథం మనుస్మృతిని దహనం చేసిన రోజును పురస్కరించుకుని ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

కాశీనాయనకు పూజలు

పెద్దారవీడు: మండల పరిధిలోని దేవరాజుగట్టు గ్రామ సమీపంలో వెలసిన శ్రీ కాశీనాయన ఆశ్రమంలో 28వ ఆరాధన మహోత్సవం సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకుడు బీవీ దత్తయ్య ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకాలు, పూజలు, పట్టు వస్త్రాలు, పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని కాయకర్పూరం సమర్పించి మొక్కులు చెల్లించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. మధ్యాహ్నం కోలాటం, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మంగళవారం మధ్యాహ్నం కోలాటం, రాత్రి శ్రీభక్త చింతామణి పూర్తి నాటకం ప్రదర్శన ఉంటుందని కమిటీ సభ్యులు తెలిపారు.

రాధాకృష్ణ మందిరంలో ప్రత్యేక పూజలు

చీరాల అర్బన్: పట్టణంలోని పాపరాజుతోటలోని రాధాకృష్ణమందిరంలో సోమవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. రోహిణి నక్షత్రం సందర్భంగా సీతారామాంజనేయ షణ్ముఖ మహిళా సమాజం ఆధ్వర్యంలో భగద్గీవత 18 అధ్యాయాలు పారాయణ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక పూజలు, అలంకరణలు నిర్వహించారు. అనంతరం 30 మంది బీద నారాయణులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో రాధాకృష్ణ మందిర కమిటీ సభ్యులు నల్లూరి బ్రహ్మం, కె.రమేష్, కె.శంకరరావు, ప్రతాప్ సాయిబాబు, వలివేటి రాంబాబు, గుగ్గిలం గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

లోక రక్షకుడు ఏసుక్రీస్తు



సింగరాయకొండ కెనాన్ ప్రేయర్ చర్చిలో ప్రార్థనలో పాల్గొన్న డాక్టర్ బత్తుల

వెలిగండ్ల: మండలంలోని అన్ని గ్రామాల్లో క్రిస్మస్ పండుగను క్రైస్తవులు సోమవారం ఘనంగా నిర్వహించారు. వెలిగండ్లలో విముక్తి బాప్టిస్టు చర్చిలో సోమవారం తెల్లవారుజాము నుంచే ప్రత్యేక ప్రార్థనలు చేశారు. క్రిస్మస్ కేక్ కట్ చేశారు. క్రిస్మస్ క్యారల్స్ పేరుతో ఇంటింటికీ తిరిగి ప్రార్థనలు చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఎంపీపీ రామన మహాలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యులు గుంటక తిరుపతిరెడ్డి, వైస్ ఎంపీపీ తాతపూడి మేరి పుష్ప, జెడ్పీటీసీ మాజీ సభ్యులు రామన తిరుపతిరెడ్డి, వైఎస్సార్ సీపీ వై నాగూర్‌యాదవ్, టి.దేవసహాయం క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మొగళ్లూరు, వెదుళ్లచెరువు, కొట్టాలపల్లి, గోకులం, కంకణంపాడు, రామలింగాపురం, రామగోపాలపురం, గుడిపాటిపల్లి, పి.నాగులవరం, పూలికుంట్ల, రాళ్లపల్లి, మోటుపల్లి, ఇమ్మడిచెరువు, నాగిరెడ్డిపల్లి, బొంతగుంట్ల, పద్మాపురం తదితర గ్రామాల్లోని చర్చిల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆయా గ్రామాల చర్చిల్లో పాస్టర్లు క్రీస్తు జననం గురించి వివరించారు. సర్పంచ్ తాతపూడి సురేష్ బాబు, చర్చి పాస్టర్ కె జోసఫ్ సిద్ధార్థ, సింగిల్‌విండో చైర్మన్ కాకర్ల వెంకటేశ్వర్లు, జేసీఎస్ మండల కన్వీనర్ పాల్లా సుబ్రహ్మణ్యం, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గజ్జల వెంకటరెడ్డి, మోటుపల్లి ఎంపీటీసీ వెంకటగురవయ్య, కె. వెంకట్రామయ్య, బొబ్బా వెంకటరెడ్డి, మారం వెంకటేశ్వరరెడ్డి, క్రైస్తవులు పాల్గొన్నారు.

పీసీపల్లి: మండలంలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చర్చిలను శోభాయమానంగా అలంకరించి భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. మండలంలోని పెదయిర్లపాడు, గుంటుపల్లి చర్చిల్లో భక్తులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

పామూరు: క్రిస్మస్ పర్వదినాన్ని మండలంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక సీఎస్‌పురం రోడ్డులో ఉన్న తెలుగు బాప్టిస్ట్‌చర్చిలో పాస్టర్ ఆర్. జోసఫ్ దైవసందేశాన్ని అందించారు. కందుకూరు రోడ్డులో ఉన్న సీయోను ప్రార్థనామందిరం, నెల్లూరు రోడ్డు, అంకాలమ్మవీధి, మండలంలోని మోపాడు, మోట్రావులపాడు, వగ్గంపల్లి, గుమ్మనంపాడు, కంబాలదిన్నె ట్రినిటీ బాప్టిస్టు చర్చిల్లో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రైవేట్ పాఠశాలలో క్రీస్తు జననం నాటికను ప్రదర్శించారు.



కనిగిరి దుర్గం చర్చిలో సందేశాన్నిస్తున్న పాస్టర్



ప్రార్థనల్లో క్రైస్తవులు

హనుమంతునిపాడు: మండలంలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. హనుమంతునిపాడులోని తిమ్మారెడ్డిపల్లి, కూటాగుండ్ల, దాసళ్లపల్లి, ముప్పాళ్లపాడు, సీతారాంపురం, దొడ్డిచింతల, కొండారెడ్డిపల్లి, వేములపాడు, లింగంగుంట్ల, నారాయిపల్లి, ఉసుళ్లపల్లి, వాలిచర్ల, పెద్ద గొల్లపల్లి, హాజీపురం తదితర గ్రామాల్లో ఆర్సీఎం, బాప్టిస్టు, బాప్టిస్టు, లూథరిన్, షారోన్, బేరక మందిరాల్లో క్రిస్మస్ వేడుకల సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. చర్చిలో దాతలు మహిళలకు చీరలు పంపిణీ చేశారు.

సీఎస్‌పురం(పామూరు): క్రీస్తుమార్గం అనుసరణీయమని సంఘకాపరి రెవరెండ్ నేరెల్ల జగన్ అన్నారు. మండల కేంద్రమైన సీఎస్‌పురంతోపాటు మండలంలోని పలుగ్రామాల్లో సోమవారం క్రిస్మస్ పర్వదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పలు చర్చిల్లో కేక్‌నుకోసి పంచిపెట్టారు. మండలంలోని డీజీపేట తెలుగుబాప్టిస్ట్ చర్చిలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో సంఘకాపరి రెవరెండ్ నేరెల్ల జగన్ క్రీస్తు బోధనలు వివరించారు. శాంతి, సహనం, సమాజసేవ మొదలైన గుణాలను ప్రతిఒక్కరు కలిగిఉండి శాంతియుత జీవితం గడపాలన్నారు.

కనిగిరి రూరల్: క్రిస్మస్ వేడుకలను వైభవంగా నిర్వహించారు. పట్టణంతోపాటు, మండలంలోని పలు గ్రామాల్లోని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. క్రైస్తవ సోదరులతో చర్చిలన్నీ కిటకిటలాడాయి. స్థానిక దుర్గం బాప్టిస్ట్ చర్చి, పాతూరు ఓల్డ్ టౌన్ చర్చి, ఆర్‌సీఎం చర్చి, చాకిరాల తదితర గ్రామాల్లోని చర్చిల్లో విశిష్ట ప్రార్థనలు జరిగాయి. దుర్గం బాప్టిస్ట్ చర్చిలో పాస్టర్ డాక్టర్ వి. ప్రభుమనోహర్ దాస్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సెంటినరి బైబిల్ కాలేజీ శంషాబాద్ నుంచి వచ్చి ప్రసంగీకులు దైవ సందేశాన్ని ఇచ్చారు. చర్చి కమిటీ చైర్మన్ గంటా విద్యా సాగర్, సెక్రటరీ తాతపుడి సర్వోనత కుమార్, ట్రెజరర్ ఎనుబరి డేవిడ్ రత్నకుమార్, స్త్రీల సమాజం వారు వి.కమలా మనోహర్‌దాస్, దైవ సేవకులు సంఘ పెద్దలు జి.నాగభూషణం, కన్వీనర్ కె.ఎల్సఫాన్ తదితరులు పాల్గొన్నారు. స్థానిక దుర్గం బాపిస్ట్ చర్చిలో ఎంపీపీ దంతులూరి ప్రకాశం, మున్సిపల్ చైర్మన్ ఎస్కే అబ్దుల్ గఫార్, వైస్ చైర్మన్ ఆర్ మాణిక్యరావు, సీహెచ్ కిషోర్ పాల్గొన్నారు. అలాగే పాతూరు ఓల్డ్ టౌన్ చర్చిలో జరిగిన ప్రార్థనల్లో ఏఎంసీ చైర్మన్ సీహెచ్ సాల్మన్‌రాజు పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

ఘనంగా క్రిస్మస్ సంబరాలు

సింగరాయకొండ: మండల కేంద్రంలోని సుందర్‌నగర్ తెలుగు బాప్టిస్టు చర్చిలో పాస్టర్ ఎం.ప్రసాద్ దైవ సందేశం అందించారు. విశ్వాసులు ప్రార్థనల్లో పాల్గొన్నారు. చిన్నారులు ఏసుక్రీస్తు త్యాగాన్ని కొనియాడారు. సింగరాయకొండలోని కానాన్ ప్రేయర్ చర్చిలో వైఎస్సార్ సీపీ వైద్య విభాగం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బత్తుల అశోక్‌కుమార్‌రెడ్డి ప్రార్థనల్లో పాల్గొన్నారు. పలువురికి దుస్తులు అందజేశారు.

కొండపి(సింగరాయకొండ): కొండపి మండలంలోని పలు చర్చిల్లో సోమవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని గొడుగులపాలెం హోలీ స్పిరిట్ చర్చిలో పాస్టర్లు ప్రభుదాస్, సాల్మన్‌రాజ్ ఆధ్వర్యంలో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

జరుగుమల్లి: మండల కేంద్రమైన జరుగుమల్లిలో బేతేలు ప్రార్థనా మందిరంలో సంఘ కాపరి నంబూరి యోహాన్ దైవ సందేశాన్ని ఇచ్చారు. మండలంలోని అన్ని చర్చిల్లో ప్రార్థనలు నిర్వహించి కేక్ కట్ చేశారు.

టంగుటూరు: స్థానిక వెంకటాయపాలెం రోడ్డులోని న్యూ లైఫ్ పరిశుద్ధ ఆరాధన మందిరంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. డాక్టర్ సుదర్శన్ దైవ సందేశాన్ని అందించారు. జయవరం, జమ్ములపాలెం గ్రామాల్లో ప్రత్యేక పార్థనలు నిర్వహించారు. దైవజనురాలు ఎస్తేరు రాణి, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

మద్దిపూడి: మద్దిపూడి, గుండ్లసముద్రం, వల్లాయపాలెం, కూచిపూడి, జువ్విగుంట, చిలంకూరు, గార్లపేట తదితర గ్రామాల్లోని చర్చిల్లో ప్రార్థనలు నిర్వహించారు. ధర్మవరం ఐఎఫ్‌జీ చర్చిలో సంపూర్ణ సంఘం ఆధ్వర్యంలో వితంతువులు, వికలాంగులకు దుప్పట్లు, చీరలు గ్రామస్తుల సహకారంతో పంపిణీ చేశారు. పండగ సందర్భంగా మద్దిపూడి బొడ్రాయి సెంటర్‌లో ఆదివారం రాత్రి శ్రీలక్ష్మీనృసింహస్వామి నాట్యమండలి ఆధ్వర్యంలో శ్రీకృష్ణరాయబారం, సత్యహరిశ్చంద్ర పౌరాణిక నాటకాలు ప్రదర్శించారు.

వెలిగండ్ల: మండలంలోని మొగళ్లూరుపల్లి చర్చిలో క్రిస్మస్ పండుగను ఘనంగా జరుపుకున్నారు. క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని క్రైస్తవులు, చిన్నారులు ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ముఖ్యఅతిథులుగా ఎంపీడీఓ టి.సుకుమార్, వెలిగండ్ల సర్పంచ్ టి సురేష్‌బాబులు పాల్గొన్నారు. ఎంపీడీఓ టి.సుకుమార్‌ను ఘనంగా సన్మానించారు.



కొండపిలోని హోలీ స్పిరిట్ చర్చిలో ప్రార్థనలు



వెలిగండ్ల విముక్తి బాప్టిస్టు చర్చిలో క్రిస్మస్ కేక్ కట్ చేస్తున్న పాస్టర్ జోసఫ్ సిద్ధార్థ



మొగళ్లూరుపల్లిలో సాంస్కృత కార్యక్రమాల్లో ఎంపీడీఓ సుకుమార్, సర్పంచ్ సురేష్



గుండ్లసముద్రం చర్చిలో ప్రార్థనలు చేస్తున్న దృశ్యం



పామూరులో దైవసందేశాన్ని అందిస్తున్న పాస్టర్ జోసఫ్



డీజీపేటలో దైవ సందేశం అందిస్తున్న పాస్టర్ జగన్



టంగుటూరులో దైవ సందేశాన్ని అందిస్తున్న డాక్టర్ సుదర్శన్



మండలంలో షారోన్ చర్చిలో కేక్ కట్ చేస్తున్న పాస్టర్ జోసఫ్



ప్రార్థనలో పాల్గొన్న ప్రజలు



విద్యుత్ దీపాలంకరణలో జరుగుమల్లి చర్చి



మద్దిపూడి బొడ్రాయి సెంటర్‌లో శ్రీకృష్ణరాయభారం పౌరాణిక నాటకం ప్రదర్శన

నేడు ఆడుదాం–ఆంధ్రా పోటీలు ప్రారంభం

సింగరాయకొండ: మండలంలోని 15 గ్రామ సచివాలయాల పరిధిలో మంగళవారం ఆడుదాం–ఆంధ్రా కార్యక్రమం ప్రారంభిస్తున్నట్లు ఎంపీడీఓ షేక్ జమీఉల్లా తెలిపారు. కార్యక్రమంలో భాగంగా మొదటి రోజు అన్ని గ్రామ సచివాలయాల పరిధిలో కబడ్డీ పోటీలు నిర్వహిస్తామన్నారు. ప్రారంభోత్సవ ర్యాలీల్లో ప్రజాప్రతినిధులు, నాయకులు, క్రీడాకారులు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

కొండపి(సింగరాయకొండ): కొండపి మండలంలోని 14 గ్రామ సచివాలయాల పరిధిలో మంగళవారం ఆడుదాం–ఆంధ్ర కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రమణమూర్తి తెలిపారు. ఉదయం 9.30 గంటలకు కొండపి జెడ్పీ హైస్కూల్ నుంచి 200 మీటర్ల జాతీయ జెండాతో భారీ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, క్రీడాకారులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పోటీలకు సర్వం సిద్ధం

పీసీపల్లి: ప్రభుత్వం మంగళవారం నుంచి నిర్వహించనున్న ఆడుదాం ఆంధ్ర పోటీలకు సర్వం సిద్ధమయ్యాయి. మండలంలోని అన్ని గ్రామాల్లో క్రీడా ప్రాంగణాలు సిద్ధం చేశారు. ఈ మేరకు 13 సచివాలయాల పరిధిలో ఇప్పటికే క్రీడాకారులు నమోదు చేశారు. పలు విభాగాల్లో దరఖాస్తు చేసుకున్న క్రీడాకారులకు ఆయా సచివాలయాల్లో పోటీలు నిర్వహిస్తారు. పోటీల్లో పాల్గొన్న వారికి మండల, నియోకవర్గ , జిల్లా, రాష్ట్ర స్థాయిలో ఎంపిక చేసి విజేతలుగా నిర్ణయిస్తారు.



పీసీపల్లి జెడ్పీహెచ్ఎస్ క్రీడా ప్రాంగణం

పేదలకు రగ్గులు పంపిణీ

లింగసముద్రం: క్రిస్మస్ పండుగ సందర్భంగా గుడూరు దేవమ్మ జ్ఞాపకార్థం ఆమె కుమారుడు సురేష్‌బాబు 75 కుటుంబాలకు రగ్గులు అందించారు. మాజీ ఎంపీపీ పూరిమిట్ల బాలకోటయ్య, మాజీ సర్పంచ్ ఉమ్మడిశెట్టి నాగేశ్వరరావులు సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆదాయపు పన్నుశాఖలో పని చేస్తున్న గూడూరు సురేష్‌బాబు ఏటా క్రిస్మస్ పర్వదినాన రగ్గులు పంపిణీ చేస్తున్నారన్నారు. బక్కమంతుల ఓంకారం, రావినూతన రాజ్‌కుమార్, బల్లి శివరంజని పాల్గొన్నారు.

అనివేటి మండప నిర్మాణానికి విరాళం

కందుకూరు: గ్రామదేవత అంకమ్మతల్లి ఆలయ పునఃనిర్మాణంలో భాగంగా చేపడుతున్న అనివేటి మండప నిర్మాణానికి భక్తుల నుంచి విరాళాలు కొనసాగుతున్నాయి. ఎమ్మెల్యే మానుగుంట మహీధర్ రెడ్డి పిలుపు మేరకు పలువురు దాతలు పెద్ద ఎత్తున మండప నిర్మాణానికి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తున్నారు. పట్టణానికి చెందిన పిడికిటి మాల్యాద్రి, ఇందిర దంపతులు రూ.25,111 విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులు కొడాలి కోటేశ్వరరావుకు అందజేశారు. అమ్మవారికి ఆలయ నిర్మాణానికి ఇంత పెద్ద మొత్తంలో భక్తులు ముందుకు వచ్చి సహకరించడం అభినందనీయమని చెప్పారు. కార్యక్రమంలో పిడికిటి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు దుప్పట్లు, చీరలు పంపిణీ

కందుకూరు: పట్టణంలోని ఉప్పుచెరువులో గల జీవనజ్యోతి దివ్యాంగ వికాస సేవా సమితి ఆధ్వర్యంలో సోమవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా క్రిస్మస్ కేక్ కట్ చేయడంతో పాటు, పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు షేక్ రఫీ మహిళలకు చీరలు పంపిణీ చేశారు. అలాగే గోనుగుంట వెంకటేశ్వర్లు (తిమోతి) దుప్పట్లు అందజేశారు. క్రైస్తవ పర్వదినాన దివ్యాంగులకు సేవా కార్యక్రమాలు చేపట్టడం ఆనందంగా ఉందని, సమాజంలో నిరాదారణకు గురైన వారికి అండగా ఉండడం ప్రతి ఒక్కరి బాధ్యతన్నారు. దివ్యాంగ సేవా సమితి ప్రెసిడెంట్ చనమాల శ్రీనివాసరావు, ప్రధానకార్యదర్శి శీలం వెంకటేష్, కోశాధికారి నూకతోటి హరిబాబు, పాస్టర్ సామ్యేలురాజు, విశ్వ, మైత్రేష్, నితీష్, చరణ్‌తేజ, శ్రీహరి, నూనె శ్రీను, ఆర్ఎంపీ డాక్టర్ రాజేంద్రప్రసాద్, దళిత నాయకుడు డిసిహెచ్ మాలకొండయ్య పాల్గొన్నారు.



దుప్పట్లు పంపిణీ చేస్తున్న సమితి సభ్యులు

రైతులకు రాయితీ విత్తనాల పంపిణీ

వేటపాలెం: తుఫాన్ కారణంగా నష్టపోయిన బాధితులను ప్రభుత్వం అన్ని విధాల అదుకుంటుందని ఏవో ఐ కాశీవిశ్వనాథ్ తెలిపారు. మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో తుఫాన్ కారణంగా పంట నష్టపోయిన 174 మంది రైతులకు 80 శాతం రాయితీపై విత్తనాలు సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లా డుతూ అక్కాయిపాలెం 76 మంది రైతులకు 11 క్వింటాలు, చల్లారెడ్డిపాలెంలో 10 మంది రైతులకు 3 క్వింటాలు, కొత్తపేటలో 32 మంది రైతులకు ఆరు క్వింటాలు, పాపాయిపాలెంలో 56 మందికి ఎనిమిది క్వింటాలు, మండలంలో మొత్తం 174 మంది రైతులకు 28 క్వింటాలు 80 శాతం రాయితీపై అందించామని తెలిపారు. మినుములు 37 క్వింటాలు, వేరుశనగ 150 క్వింటాలు మండలానికి కేటాయించారన్నారు. వీఏఏలు స్వాతి, రామారావు, వినయ్ పాల్గొన్నారు.



విత్తనాలు అందిస్తున్న ఏవో కాశీవిశ్వనాథ్

ప్రభుత్వ పథకాలపై అవగాహన అవసరం

పామూరు: ప్రభుత్వ పథకాలపై ప్రజలు అవగాహన కలిసి పథకాలను ఉపయోగించుకుని అభివృద్ధి చెందాలని ఎంపీడీఓ ఊట్ల శ్రీనివాసులు, వైస్ ఎంపీపీ గంధం యేసురత్నం అన్నారు. మండలంలోని దూబగుంట్ల, నర్రమారెళ్ల గ్రామ పంచాయతీల పరిధిలో సోమవారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర సర్పంచ్‌లు కందుల శ్రీకాంత్‌రెడ్డి, గంధం సుధారాణిల అధ్యక్షతన నిర్వహించారు. ఈసందర్భంగా ఆధునిక వ్యవసాయ పద్ధతులు, వ్యవసాయంలో డ్రోన్ వినియోగం, కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న 17 రకాల సంక్షేమ, అభివృద్ధి పథకాలు వివరించారు.

కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ కేఎల్.శ్రీనివాసరావు, ఏఓ కంచం రాధ, డాక్టర్ రుబీనా, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గోళ్ల రాజ్యలక్ష్మి, పార్వతి, పీఎస్ ఆదాంబీ, బీజేపీ నియోజకవర్గ అధ్యక్షుడు కొండిశెట్టి వెంకట రమణయ్య, ఉడుముల ప్రభాకర్, గుంటుపల్లె చెంచురామయ్య, సూరిపోగు మాల్యాద్రి, హెచ్ఈఓ ఎస్.బ్రహ్మానందం, జేవీఎస్.ప్రసాద్, స్వచ్ఛభారత్ మండల కో ఆర్డినేటర్ ఎం శివరామయ్య, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు

నూరుశాతం ఫలితాలు సాధించాలి

సీఎస్‌పురం(పామూరు): పదో తరగతి విద్యార్థులు నూరుశాతం ఫలితాలు సాధించి ప్రభుత్వ పాఠశాలల సత్తా చాటాలని యూటీఎఫ్ మండల అధ్యక్షుడు జవంగుల వెంకట్రావు, ప్రధాన కార్యదర్శి షేక్.పాదుషా అన్నారు. స్థానిక కస్తూరిబాగాంధీ బాలికా విద్యాలయంలో విద్యాలయం ఎస్‌వో షేక్.రేష్మ అధ్యక్షతన సోమవారం జరిగిన కార్యక్రమంలో యూటీఎఫ్ మండలశాఖ ఆధ్వర్యంలో విద్యాలయంలోని 34 మంది విద్యార్థులకు దాత పాలుగుళ్ల లక్ష్మి సమకూర్చిన టెస్ట్ పేపర్స్‌ను ఎస్ఓ రేష్మ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం విద్యారంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తుందని, దాతల చూయూతను సైతం ఉపయోగించుకుని మెరుగైన ఫలితాలు సాధించాలని కోరారు. కార్యక్రమంలో కె.వెంకటేశ్వర్లు, పఠాన్ నాయబ్‌రసూల్, ఇర్ల కొండయ్య, ఎన్ వెంకట్రామయ్య పాల్గొన్నారు.



దాతలు అందజేసిన టెస్ట్ పేపర్స్‌తో విద్యార్థులు, ఎస్ఓ

ఘనంగా వాజ్‌పేయి జయంతి వేడుకలు

పామూరు: భారతరత్న, మాజీ ప్రధాని అటల్ బిహారి వాజ్‌పేయి జయంతి వేడుకలను స్థానిక బీజేపీ కార్యాలయం వద్ద ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా బీజేపీ రాష్ట్ర నాయకులు, కనిగిరి నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొండిశెట్టి వెంకట రమణయ్య పలువురు వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థిక సంస్కణలతో దేశ ఆర్థికవ్యవస్థను బలోపేతం చేసిన మహోన్నత వ్యక్తి వాజ్‌పేయి అని కొనియాడారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులు కొప్పరపు వెంకట సుబ్బారావు, మండల యువమోర్చా అధ్యక్షుడు పాడే అరవింద్, ప్రధాన కార్యదర్శి బొంతల హజరత్‌కుమార్, పందిటి శ్రీనివాసులు, మండల కార్యదర్శి దేవిశెట్టి పవన్‌కుమార్ పాల్గొన్నారు.



వాజ్‌పేయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నేతలు